డీఐఈవోగా బాధ్యతలు స్వీకరించిన గంగాధర్

కరీంనగర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో)గా జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి గంగా ధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఐఈవోగా పనిచేసిన జి జగన్‌మోహన్‌రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో గంగా ధర్ బాధ్యతలు చేపట్టారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

- నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్, అడిషనల్ కలెక్టర్లు

కరీంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నియోజక వర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌చార్జి మంత్రుల నుంచి లబ్ధిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవా లని, అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇళ్లు కేటాయించి లబ్ధిదారు లను ఎంపిక చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరి గేలా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేస్తామన్నారు. లిస్టు-1, లిస్టు-2, లిస్టు-3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. గత నెల 17 నుంచి 30 వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. పైలెట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ, దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు ఇప్పటివరకు 590 మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహించడం జరిగిందని, ఇందులో 85,527 మంది పౌరులు, 1,62,577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 4న జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అన్ని మండలాల్లో భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. 10,568 ఇందిరమ్మ దరఖాస్తులకు సంబంధించి విచారణ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని, పేదలలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఈ నెల 4న జరిగే నీట్ పరీక్షల కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని, మొత్తం 7 పరీక్ష కేంద్రాల్లో 2,975 మంది నీట్ పరీక్ష రాస్తున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రేపు నీట్ యూజీ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 2,975 మంది అభ్యర్థులు

తిమ్మాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరి వైద్య వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థుల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ - 2025 పరీక్ష ఆదివారం జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షల కోసం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 2,975 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అభ్యర్థులందరూ మూడు పేజీల అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఇచ్చిన సూచనల మేరకు జాగ్రతలు పాటించాలి. పరీక్ష రాసే అభ్యర్థులు తమ వెంట అడ్మిట్ కార్డుతో పాటు ప్రభుత్వంచే జారీ చేసిన ఐడి ప్రూఫ్(అధార్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, ఇతరములు) ఉంచుకోవాలి. దరఖాస్తు ఫారమ్‌లో అప్‌లోడ్ చేసిన విధంగానే రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒకటి పోస్ట్ కార్డు సైజు ఫొటో తీసుకురావాలి. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్ ఉండాలి. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరి కరాలు, మొబైల్ ఫోన్‌లు ఎలాంటి నిషేధిత వస్తువులు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదు. పెన్ను కూడా తీసుకువెళ్లవద్దు, పరీక్ష కేంద్రంలోనే పెన్ను ఇస్తారు. విద్యార్థులు జీన్స్ ప్యాంటు ధరించకూడదు. సాధారణ దుస్తు ల్లోనే పరీక్షకు హాజరుకావాలి. టోపీలు, కళ్లజోడు(సన్ గ్లాసులు), ముక్కు పుడక, చెవి కమ్మలు, గాజులు సహా ఎలాంటి అభరణాలు ధరించకూడదు.

ఒక్క నిమిషం నిబంధన

పరీక్ష మధ్నాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుంది. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతి స్తారు. పరీక్షకు అరగంట ముందే అంటే మధ్యాహ్నం 1.30గంటలకు పరీక్ష కేంద్రం గేటు మూసివేస్తారు. ఒక్క నిమిషం అలస్యం అయినా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు.సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహిస్తారు.

రేపు ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు నిషేధం

కరీంనగర్ క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న నీట్ పరీక్ష నేపథ్యంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు ఆంక్షలు విధిస్తూ పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నీట్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు సీపీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ పట్టణం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, ఎల్ఎండి కాలనీ పోలీసు ఠాణాల పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు సీపీ తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, రాస్తా రోకోలు, హర్తాళ్లకు అనుమతి లేదు. ఈ ఉత్తర్వులు మే 3వ తేదీ అర్ధరాత్రి నుంచి మే 4వ తేదీ అర్ధరాత్రి వరకు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం ఆశా ఫెసిలిటేటర్స్‌తో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిజేరియన్ డెలివరీల వల్ల ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలను గర్భిణీలకు వివరించాలన్నారు. గర్భవతులను గైనకాలజీ డాక్టర్ చేత హెల్త్ చెకప్ చేయించాలని సూచించారు. గర్భం సమయంలో ఏమైనా సమస్యలు ఉంటే వాటికి పూర్తిగా చికిత్స అందించాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ అధిక రక్తపోటు, షుగర్ పరీక్షలు చేసి నిర్ధారణ అయిన వారందరికీ ఉచితంగా మందులు అందేలా చూడాలన్నారు. తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలను, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి పోషకాహార పునరావాస జిల్లా కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పీవో డీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, డీఐవో డాక్టర్ సాజిద, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనజవేరియా, డెమో రాజగోపాల్, డీపీహెచ్‌ఎన్‌వో విమల, డీపీఎం రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం సభ సేవలను వినియోగించుకోవాలి

శుక్రవారం సభలో వివిధ శాఖల నుంచి అందుతున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక సప్తగిరికాలనీ పీహెచ్‌సీ పరిధిలోని మార్కండేయనగర్‌లో నిర్వహించిన శుక్ర వారం సభకు ఆయన హాజరై మాట్లాడారు.

శుక్రవారం సభలో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో మహిళలందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకొని అక్కడ అందుతున్న సేవలను పూర్తిగా వినియోగించుకోవాల న్నారు.తీవ్ర పోషకాహార లోపమున్న పిల్లలను, బరువు తక్కువగా ఉన్న పిల్లలను జిల్లా కేం ద్రంలోని పోషకాహార పునరావాస కేం ద్రానికి తరలించి వారికి పూర్తి స్వస్థత చేకూర్చాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులో ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సన జవేరియా, సీడీపీవో సబిత, సప్తగిరికాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మీర్ సాఫిర్ హుస్సేన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం తనిఖీ చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను వెరిఫికేషన్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌కు కేటాయించిన గెజిటెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో గెజిటెడ్ అధికారి వెరిఫికేషన్ సోమవారంలోగా పారదర్శకంగా జరగాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. డివిజన్ లెవల్‌లో వార్డు ఆఫీసర్లను వెంట బెట్టుకొని వెరిఫికేషన్ ప్రక్రియను సోమవారంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్లు స్వరూప రాణి, ఖాదర్ మోహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, డీఈలు లచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రావు,అయూబ్‌ఖాన్, వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజం కోసమే ఎర్రజెండా పోరాటాలు

- పహల్గాం ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, మే 2(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం ఎర్రజెండా పార్టీలు పోరాటాలు చేస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటకరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో అందె చిన్న స్వామి అధ్యక్షతన సీపీఐ 19వ మండల సభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ పహల్గాం ఘటన కేంద్ర ప్రభు త్వ వైఫల్యమే అన్నారు. అందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని అన్నారు. దేశంలో నియంత పాలన సాగుతుందని అన్నారు. కేంద్ర ప్రభు త్వం అవలంబిస్తున్న విధానాలపై దేశ ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు.రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లా డుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొత్తులేకపోతే సీపీఐ ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెం లక్ష్మి, బోయిని అశోక్, అందె స్వామి, కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, చాడ శ్రీధర్‌రెడ్డి, చిన్న స్వామి, బోయిని పటేల్, కాంతల శ్రీనివాస్‌రెడ్డి, మండల స్థాయి నాయకులు, అన్ని గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కొనుగోళ్లకు ఎండదెబ్బ

- కేంద్రాల్లో భారీగా పేరుకుపోతున్న ధాన్యం
- మబ్బులతో రైతుల్లో గుబులు



నగునూర్ కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం



జూబ్లీనగర్‌లో...

కరీంనగర్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో ఎండ తీవ్రతకు కాంటాలు కాక ఎక్కడిక్కడే ధాన్యం కుప్పలుగా పేరుకు పోయింది. ఈ సీజన్‌లో వర్షం భయంతో రైతులు వరి కోతలు ముందస్తుగా మొదలు పెట్టారు. కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో11, దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 6, ఐకేపీ ఆధ్వర్యంలో 3 కేంద్రాలను ఏర్పాటు చేసి కోనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎండ తీవ్రతకు హమాలీలు సరిగా కాంటాలు వేయకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకు పోతున్నాయి. ఉదయం 10గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి హమాలీలు కాంటా లు వేస్తున్నారు. దీంతో కాంటాలు కాక పోవడంతో రైతులు కొనుగోలు కేం ద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో ఈ సీజన్‌లో 12,300 ఎకరాల్లో పంటలను సాగు చేయగా, 10,200 ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం, 2,100 ఎకరాల్లో సన్న రకం వరి సాగు చేశారు. గత సీజన్‌లో 1లక్ష 49 క్వింటాళ్ల వరి ధాన్యంను ఆయా కేంద్రాల్లో సేకరించారు. కరీం నగర్ మండలంలో కరీంనగర్ వ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 719 మంది రైతుల వద్ద నుంచి 43వేల 558 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు. అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో 175 మంది రైతుల వద్ద నుంచి 8,974 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 490 మంది రైతుల వద్ద నుంచి 25,500 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం రాశులు కుప్పలు కుప్పలుగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. మారుతున్న వాతావరణం దృష్ట్యా అకాల వర్షంతో రైతులు గుబులు చెందుతున్నారు. వర్షం కురిస్తే పండిం చిన పంట నేలపాలవుతుందని ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వెంటవెంటనే తూకం వేయాలని రైతులు కోరు తున్నారు.



దుర్శేడ్‌లో..

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కబ్జాల నుంచి కాపాడాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతి

భగత్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కబ్జాల నుంచి కాపాడాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కోతిరాంపూర్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి మత్స్య సొసైటీలకు ఉచిత చేప పిల్లలకు బదులుగా మత్స్యసొసైటీ జల వనరులకు సరిపడే చేప పిల్లల కొనుగోలుకు సొసైటీ ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని జింకలపార్కు పక్కన ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కబ్జాల నుంచి కాపాడి నిధులు, సిబ్బందిని కేటాయించాల న్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జునగరి గణేష్, నూనె శేఖర్, పప్పు సదానందం, జునగిరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వృద్ధుడి బలవన్మరణం

మానకొండూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోలం పోచాలు(76) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పోచంపల్లికి చెందిన పోచాలుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా అందరికి వివాహాలు జరిగాయి. ఇద్దరు కుమారులు కరీంనగర్‌లో ఉంటున్నారు. పోచాలు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని పలు ఆసుపత్రులలో చికిత్స చేయించారు. అయినా కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో ఇంటి ముందు గల బాత్‌రూంలో ఇనుప రాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి పెద్ద కుమారుడు రవి ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

కుంటలో చేపలు పడుతూ ఒకరి మృతి

శంకరపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లి శివారులోని కుంటలో శుక్రవారం చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం కొల్లూరి చంద్రమౌళి(62), అతనిభార్య పొలంవద్దకు వెళ్లారు. పొలం సమీపంలో ఉండే చింతకుంటలో దంపతులు ఇద్దరు చీరను ఇరువైపులా పట్టుకొని కుంటలో చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో చంద్రమౌళి చీరను పట్టుకొని నీటిలో ముందుకు నడుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు కుంటలో ఉన్న లోతైన బురదగుంతలో పడి మునిగిపోయాడు. గమనించిన అతని భార్య సరమ్మ, ఇతరులు చీరతో లాగుతూ బయటకు తీసుకు వచ్చే సరికి అప్పటికే నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేశవపట్నం ఎస్సై కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

చెట్టుపై నుంచి పడి కార్మికుడి దుర్మరణం


యోగేశ్వర్ (ఫైల్)

జ్యోతినగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మనెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో శుక్రవారం చెట్టుపైనుంచి కిందపడి యోగేశ్వర్ సునాని(45) అనే వలసకార్మికుడు మృతి చెందాడు. టౌన్‌షిప్‌లోని చైతన్య పాఠశాల ఆవరణలో ఎన్టీపీసీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం(జెమ్) ఏర్పాట్లకు సంబంధించి కాంట్రాక్టరు వద్ద యోగేశ్వర్ పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనవిరామ సమయంలో పక్కనేఉన్న ఒకక్వార్టర్స్‌లోని మామిడిచెట్టుకాయలు కోసేందుకు యోగేశ్వర్ చెట్టెక్కాడు. ప్రమాదవశాత్తు జారికిందపడగా తీవ్రంగా గాయపడిన అతడిని ఎన్టీపీసీ ఆసుపత్రికితరలించి చికిత్సచేస్తుండగా చనిపోయాడు.మృతుడు పీకే రామయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికిభార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి 3.5లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాతోపాటు అంత్యక్రియల కోసం రూ.50వేలు ఇచ్చేందుకు కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరింది. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీలో పనిచేసే మల్టిపర్పస్ వర్కర్ నర్సయ్య (51) ఇసుక లారీ ఢీకొని మృతిచెందాడు. గ్రామ పంచాయతీలో మల్టిపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏడెళ్ల నర్సయ్య అనే కార్మికుడు శుక్రవారం పనులు పూర్తి చేసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయానికి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి నుంచి మంథనికి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో నర్సయ్య లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ప్లంబర్ మృతి

పెద్దపల్లిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో భాగంగా ఓ ఇంట్లో పని చేస్తుండగా కరెంట్ షాక్ గురై ప్లంబర్ శుక్రవారం మృతి చెందాడు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గజ్జెల శ్రీనివాస్ (45) పట్టణంలోని సుభాష్‌నగర్‌లో గోడలను కట్‌చేస్తుండగా అందులోఉన్న కరెంట్ వైర్‌కు విద్యుత్తు సరఫరా జరిగి షాక్‌తో కిందఉన్న రాళ్లపై పడ్డాడు. తల వెనుకభాగంలో బలంగా దెబ్బతగలడంతో మృతిచెందాడు. మృతుడి కూతురువైష్ణవి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

భర్తపై హత్యాయత్నం చేసిన భార్య

ధర్మపురి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బలగూడెం గ్రామానికిచెందిన తట్ల పోచంపై భార్య లక్ష్మి గురువారం హత్యాయత్నానికి పాల్పడింది. ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. తట్ల పోచం నిత్యంతాగివచ్చి భార్యలక్ష్మితో గొడవపడుతుండేవాడు. ఈనెల1న తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భరించలేక భర్తను చంపాలనే ఉద్దేశంతో లక్ష్మి ఇంట్లోని బాడిశతో అతడితల, ముఖంపైన దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన పోచంనుఆసుపత్రికి తరలించారు. పోచంకొడుకు మహేందర్ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బుగ్గారం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన మ్యాదరవేని విజయ అనే మహిళా రైతుకు చెందిన గేదె శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు వివరాల మేరకు శుక్రవారం మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎర్త్ వైరుకు కరెంట్ సరఫరా కావడంతో అటుగా వెళ్లిన గేదెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.85 వేలు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఈప్రాంతంలో నలుగురు రైతుల గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయని, పలుసార్లు విద్యుత్ అధికారులకు కంచె ఏర్పాటు చేయాలని విన్నవించుకున్న పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఉదయం వేళ

బస్సులు నడిపించరూ..

● ధర్మారం-కరీంనగర్ మధ్య ప్రయాణికుల ఇబ్బందులు ● ఉదయం 8 నుంచి 10 వరకు ఒకటే బస్సు ● బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్

సరైన సమయానికి ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యార్థులు కాలేజీలకు, ఉద్యోగులు అఫీసులకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సుల్లేక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ధర్మారం, మే 2 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారు. పెద్దపల్లి, జగిత్యాల, లక్షెట్టిపేట నుంచి వచ్చే ప్రయాణికులకు ధర్మారం బస్టాండ్ సెంటర్ పాయింట్‌గా ఉంటుంది. ఈ రూట్లలో వచ్చే బస్సుల్లో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ధర్మారం బస్టాండ్ చేరుకొని అక్కడి నుంచి కరీం నగర్‌లో వెళ్తారు.

ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల నుం చి విద్యార్థులు కరీంనగర్‌లోని వివిధ కళాశాలలకు వెళ్తుంటారు. వీరంతా ఉదయం 9 గంటలకు కాలేజీలకు చేరుకోవడానికి గ్రామాల నుంచి 7 గంటల వరకు ధర్మారం బస్టాండ్ చేరుకుంటున్నారు.


ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

ధర్మారం బస్టాండ్ నుంచి 7 గంటలకు ఒక బస్సు ఉండగా దాని తరువాత 9.20 నిమిషాల వరకు బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 7 నుంచి 9 గంటల మధ్యలో ఒకటి రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నా అవి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు కావడంతో ప్రయాణికులతో ఉంటుంది.

ఆ బస్సులో పది మంది వరకు విద్యార్థులు అతి కష్టం మీద ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తూ కరీంనగర్ చేరుకుంటుండగా, మిగతా వారు గంటల తరబడి బస్టాండ్‌లోనే నిరీక్షిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9 తరువాత వచ్చే బస్సుల్లో విద్యార్థులు కాలేజీలకు చేరుకునే సరికి 10.30 అవు తుందని, దీంతో కళాశాల సిబ్బంది అనుమతించ డం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, వివిధ పనులపై కరీంనగర్ వెళ్లె ప్రయాణికులతో ధర్మారం బస్టాండ్ ఉదయం రద్దీగా ఉంటుంది. కాలేజీ, ఆఫీసు సమయాల్లో ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు గంటలుగా ఎదురుచూపులు

చల్లూరి మహిత. (విద్యార్థిని, పాతగూడూర్)

ఎండపల్లి మండలం పాతగూడూర్ గ్రామం. శ్రీచైతన్య కాలేజీలో బీటెక్ చేస్తున్నా. మా ఊరి నుంచి 7 గంటల వరకే బస్టాండ్‌కు వచ్చాను. బస్సు కోసం రెండు గంటలు ఎదురుచూడాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ వచ్చిరా అందులో జాగలేక ఎక్కలేదు. ఒక్క బస్సులో 110 మంది ప్రయాణిస్తున్నారు. ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి.



కళాశాలకు అనుమతించడం లేదు

అట్ల సమత (విద్యార్థిని, చామనపల్లి)

ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామం. మా ఊరు నుంచి బస్సులో ధర్మారం వచ్చాను. బస్టాండ్‌లో కరీంనగర్‌కు బస్సులు ఉండడం లేదు. 9.20 కి బస్సు వస్తుంది. బస్సులో బాగా రద్దీగా ఉండి నిలబడాల్సి వస్తోంది. కళాశాలకు వెళ్లే వరకు 10.30 అవుతుంది. దీంతో కళాశాల యాజయాన్యం లోపలికి అనుమతించడం లేదు. మధ్యాహ్నం లంచ్ టైం వరకు బయటే ఉండాల్సి వస్తోంది. ఉదయం వేళలో బస్సుల సంఖ్య పెంచాలి.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

పెద్దపల్లి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ అయ్యాయని రైతు పెర్క రాజు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రంలో ఆరబోయగా గురువారం రాత్రి గుర్తు తెలియన దుండగులు సుమారు 4 బస్తాల వరకు ధాన్యం ఎత్తుకెళ్లారని రైతు రాజు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు కాని ధాన్యానికి ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. పరిహారం చెల్లించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

మొబైల్ ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

● జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



బాధితురాలికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, జిల్లా పోలీసులు సూచించిన సీఈఐఆర్ అప్లికేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు పోగొట్టుకున్న రూ.20లక్షల విలువైన 102సెల్‌ఫోన్‌లను ఎస్పీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్‌లు పోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెంటనే ఫిర్యాదు చేస్తే ఫోన్‌లను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మొబైల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 986 ఫోన్‌లు రికవరీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబరచిన ఇన్‌స్పెక్టర్ రఫీక్, ఆర్‌ఎస్‌ఐ కృష్ణ తదితరులను ఎస్పీ అభినందించారు.

అదుపుతప్పిన కారు.. ఒకరికి స్వల్పగాయాలు

వేములవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మొదటి బైపాస్ రహదారిలో గల మహాలక్ష్మీవీధి ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున మారుతి బ్రీజా కారు అదుపుతప్పి చెట్టునుఢీకొంది. వేగంగా దూసుకువచ్చి చెట్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకరికి స్వల్పగాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

గాలికి ఎగిరిపోయిన రేకుల షెడ్డు

శంకరపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్‌లో గురువారం అర్ధరాత్రి వీచిన గాలికి పూదరి రవి-రమ దంపతులు ఇంటిముందు వేసుకున్న రేకులషెడ్డు పైపులతోసహా లేచి సమీపంలో ఉన్న టేకుచెట్ల కొమ్మలకు తట్టుకొని ఆగింది గాలి దుమారానికి కొన్ని రేకులు ముక్కలు ముక్కలయ్యాయి. సుమారు రూ.40వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆస్తినష్టంపై పంచాయతీ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

గోదావరిఖనిలో రౌడీషీటర్లపై హత్యాయత్నం


గాయపడిన చీమల తిరుపతి

కోల్‌సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో శుక్రవారం చీమల తిరుపతి(38) అనే రౌడీషీటర్‌పై హత్యాయత్నం జరిగింది. బోనగిరి రాకేష్ అలియాస్ రాజేంద్రకుమార్, రాగుల రాజశేఖర్‌లు పాతగొడవలను మనసులో పెట్టుకుని తల్వార్, కత్తితో దాడి చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన తిరుపతిని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అతనిపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. చీమల తిరుపతి, రాకేష్, రాజశేఖర్‌లు 2021లో జరిగిన సీపీఎంకార్యకర్త బండారి మొగిలి హత్య కేసులో నిందితులు. అదే కాలనీకిచెందిన మొగిలిని భూ వివాదంలో హత్య చేసినట్టు కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో చీమల తిరుపతి ప్రధాననిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ఈ కేసు ట్రయల్‌కు వచ్చింది. రాజశేఖర్, రాకేష్‌లు ఈకేసును రాజీ చేసుకుందామని చీమల తిరుపతిపై ఒత్తిడి పెడుతున్నట్టు తెలుస్తుంది. అతడు కేసు రాజీకి ఆసక్తి కనబర్చకపోవడంతో వీరి మధ్య విభేదాలు తలెత్తినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం ప్రశాంత్‌నగర్‌లో తిరుపతి వెనుక వెళ్లిన రాకేష్, రాజేష్‌లు అతనితో ఘర్షణ పడి పక్కనే ఉన్న ఒకఆన్‌లైన్ సెంటర్‌లోకి లాక్కువెళ్లి తల, చేతిపై కత్తులతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. బాధితుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఓదెల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక నుంచి కనగర్తి వెళ్లే రోడ్డుమూలమలుపు వద్ద గురువారం రాత్రి లారీబోల్తాపడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సుల్తానాబాద్, సుద్దాల ఇటుక బట్టీల నుంచి లారీ ఓదెల మండలం కనగర్తి మీదుగా పొత్కపల్లి వైపు వస్తుండగా మడక మూలమలుపు వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా కొయ్యూరుకుచెందిన డ్రైవర్, ఓనర్ కుంభం మహేష్ తలకు గాయాలయ్యాయి. ప్రస్తుతం కొయ్యూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు. నల్లమట్టిని రవాణా చేసి ఇటుక బట్టీల వద్ద అన్‌లోడ్ చేసిన తర్వాత, అక్కడి నుంచి మళ్లీ మట్టిలోడు కోసం వేగంగా వస్తుండగా ప్రమాదం చోటుచేసుకొంది. మూడేండ్ల క్రితం ఇదే మూల మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ప్రమాదకరంగా ఉన్న ఈ మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేదా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కొడిమ్యాలలో వివాహిత హత్య


మమత(ఫైల్)

కొడిమ్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన అవుదుర్తి మమత(35) హత్యకు గురైంది. సంఘటన స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలంరవి పరిశీలించారు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. 20సంవత్సరాల క్రితం కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మహేందర్ గంగాధర మండలం మల్లాపూర్‌గ్రామానికి మమతకు వివాహం జరిగింది. సంవత్సరం నుంచి భర్త మహేందర్, అత్తమామలు వజ్రవ్వ, లక్ష్మణ్, మరుదులు అనిల్, వెంకటేష్ ఆస్తితగాదా విషయంలో మమతను కట్నం తీసుకరాలేదని, సంతానం లేదని మానసికంగా వేధిస్తున్నారు. ఆస్తి తగాదాల విషయంలో తన తల్లిగారింటివద్ద ఉంటున్న మమతను గతనెల 26న మహేందర్ కొడిమ్యాలకు తీసుకువచ్చి హత్యచేశాడు. అనంతరం 28న కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనభార్య కనబడడంలేదని ఫిర్యాదుచేశాడు. మహేందర్‌ను మమత తల్లిదండ్రులు నిలదీయగా మాట దాటవేసాడు. అనుమానంతో శుక్రవారం కొడిమ్యాలలో తాళం వేసిన ఇంటిని తనిఖీచేసి చూడగా మమత మృతదేహం కనిపించింది. అల్లుడు మహేందర్ తన కూతురు మమతను హత్య చేశాడని మృతురాలి తల్లి రాచకొండ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కోనరావుపేటలో చిరుత సంచారం

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గుట్ట ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నదని ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ పల్లె శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట బస్టాండ్ ప్రాంతం సమీపంలోని పల్లెప్రకృతి వనంను ఆనుకుని ఉన్న గద్దగుట్ట నుంచి చిరుత పొలాల వైపు వెళ్లిందన్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన దండురవి ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతుండగా శుక్రవారం రాత్రి 7గంటలకు చిరుత రోడ్డు దాటుతుండడాన్ని గమనించాడన్నారు. ఈ విషయం తెలుసుకుని అధికారులు కే సుదర్శన్, బీ అభిషేక్‌రావుతో కలిసి తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని తెలిపారు. వెంకట్రావుపేట గుట్ట నుంచి కిందికి దిగి పొలాల వైపు వెళ్లినట్లుగా చిరుత అడుగులను గుర్తించామన్నారు. అటవీప్రాంత రైతులు తమ పశువులను ఇంటి వద్దనే కట్టేసి ఉంచుకోవాలన్నారు. రైతులు రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. కోనరావుపేటలో చిరుత సంచారంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

రెండు లారీలు ఢీ


ఢీకొన్న రెండు లారీలు

జమ్మికుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయం సమీపంలో శుక్రవారం యూటర్న్ తీసుకుంటున్న ఓ లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీ కొట్టింది. జమ్మికుంట నుంచి గజ్వేల్ వెళ్తున్న లారీ అయ్యప్పస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వేబ్రిడ్జివైపు వెళ్లేందుకు డ్రైవర్ యూటర్న్ తీసుకున్నాడు. అదేసమయంలో హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వైపు వస్తున్న మరో లారీ వేగం ఒక్కసారిగా కంట్రోల్ కాకపోవడంతో ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీలు ధ్వంసం అయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు.

పోలీస్ స్టేషన్ ఎదుట

మృతుడి బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్థులు

జగిత్యాలరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి భూవివాదం నేపథ్యంలో గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోగా శుక్రవారం మృతుడి బంధువులు, గ్రామస్థులు జగిత్యాలరూరల్ పోలీస్ స్టేషన్‌ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మృతుడిబంధువులు మాట్లాడుతూ మృతుడు మల్లారెడ్డికి సంబంధించిన భూమిని ఆక్రమించడంతోపాటు పడిగెల గంగారెడ్డి, పడిగెల రాజిరెడ్డి, పడిగెల జనార్దన్ అనేవ్యక్తులు మల్లారెడ్డిని చంపుతానని బెదిరించడంతోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కూతురు శరణ్య ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్ చుట్టూ మూడునెలల నుంచి తిరిగినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. మృతుడిచావుకు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ విషయమై జగిత్యాలరూరల్ సీఐ కృష్ణారెడ్డిని వివరణ కోరగా పడిగెల గంగారెడ్డికి మృతుడు మల్లారెడ్డికి 30 సంవత్సరాలుగా భూవివాదం జరుగుతుందన్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు మోఖమీదికి వెళ్లి విచారణ చేపట్టామని, భూవివాదం కాబట్టి రెవెన్యూలో గాని, కోర్టు పరిధిలో తేల్చుకోవాలని వారికి సూచించామన్నారు. మృతుడు మల్లారెడ్డిని బెదిరించినట్లు తమకు ఫిర్యాదు అందలేదని అన్నారు. మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమాన్ దీక్షాపరుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నటరాజ్ చౌరస్తాలో శుక్రవారం ఆర్టీసీబస్సు ఢీకొని జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందిన కృష్ణమూర్తి (53) అనే హనుమాన్ దీక్షాపరుడు మృతిచెందాడు. నిజామాబాద్ వైపు నుంచి జగిత్యాలకు వస్తున్న ఆర్టీసీ బస్సు నటరాజ్ చౌరస్తా వద్ద కృష్ణమూర్తి రోడ్డుదాటుతున్న సమ యంలో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

● ఎమ్మెల్యే పరామర్శ..

కృష్ణమూర్తికుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే ఆయన ఆసుపత్రికి వెళ్లి కృష్ణమూర్తి భౌతిక కాయాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి కృష్ణమూర్తితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ చాంద్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ పుల్లా కరుణాకర్

బసంత్‌నగర్‌లో బైక్ దొంగల అరెస్టు

పాలకుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ పోలీసులు శుక్రవారం బైక్ దొంగలను అరెస్టుచేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ పుల్లా కరుణాకర్ మాట్లాడుతూ నిందితుల నుంచి రూ.5లక్షల విలువగల ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి వాహనాలను దొంగిలిస్తున్నారన్నారు. ఇద్దరినీ అరెస్టు చేశామని, ముగ్గురు మైనర్లు ఉండగా ఒక్కరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఏసీపి గజ్జి కృష్ణ, ఎస్ఐ ఆర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది కొత్తపల్లె బస్టాప్ వద్ద ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

దోస్త్ నోటిఫికేషన్ విడుదల

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో 2025 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్2025 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. మే 29న ఫస్ట్ ఫేస్ సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. ఫస్ట్ ఫేస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు మే30 నుంచి జూన్ 6వ తేదీలోపు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. సెకండ్ ఫేస్ దరఖాస్తుల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది. సెకండ్ ఫేస్‌లో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు రూ.400 చెల్లించాలి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 13న రెండో దశ సీట్లు కేటాయించనున్నారు. జూన్ 13 నుంచి 18వ తేదీ లోపు ఆయా కళాశాల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. థర్డ్ ఫేస్ దరఖాస్తుల ప్రక్రియ జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనుంది. రిజిస్ట్రేషన్‌కు రూ.400 చెల్లించాలి. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 23 నుంచి 28 వరకు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 30 నుంచి డిగ్రీ ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

- 7 నుంచి జూన్ 6 వరకు
- 13 నుంచి 23 సంవత్సరాల బాలబాలికలు అర్హులు
- కరీంనగర్, జగిత్యాల, వేములవాడ, గోదావరిఖనిలో ఏర్పాటు


వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్రికెట్ సంఘం సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో రెండు, వేములవాడ, జగిత్యాల, గోదావరిఖనిలో ఒక్కోటి చొప్పున మొత్తం ఐదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 7 నుంచి జూన్ 6 వరకు శిబిరాలను కొనసాగుతాయన్నారు. 13 నుంచి 23 సంవత్సరాల్లోపు వయస్సుగల బాలబాలికలు, యువత అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 6వ తేదీలోగా జిల్లా క్రికెట్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో ఈ నెల 12 నుంచి ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని అందులో రాణించే క్రీడాకారులను వచ్చే నెలలో హెచ్‌సీఏ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిబిరాల్లో శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్, మనోహర్‌రావు, కోశాధికారి శ్రావణ్, సంయుక్త కార్యదర్శి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా శ్రీవాణి



గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణ (కాన్ఫిడెన్షియల్) అధికారిగా అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్ కె.శ్రీవాణి నియామకమయ్యారు. శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ రవికుమార్‌కు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఇంగ్లీష్, తెలుగు, ఎంకాం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, బాటనీ, జంతు శాస్త్రం ఇలా మొత్తం కోర్సుల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రజనీ దేవి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఫలితాలు విడుదల చేస్తున్న పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్ రెడ్డి

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై సందిగ్ధం

- ఫ్యాక్టరీలు తెరిపించడంపై స్పష్టత కరువు
- తేలని నిర్వహణ.. ప్రభుత్వమా..ప్రైవేటా.. సహకార పద్ధతిలోనా?
- నిజామ్ షుగర్స్ పునర్‌వైభవానికి అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) పునరుద్ధరణపై సందిగ్ధం నెలకొంది. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అడుగులు వేసిన ప్పటికీ సరైన స్పష్టత రావడం లేదు. జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కర కర్మాగారంతో పాటు నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి కర్మాగారాలను తెరిపించడానికి గత యేడాది జనవరి నెలలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ కొంత ప్రక్రియ పూర్తి చేసింది. ఉమ్మడి యాజమాన్యం పరిధిలోని ఈ ఫ్యాక్టరీలకు చెందిన రూ. 400 కోట్ల బ్యాంకుల బకాయిలకు సంబంధించి వన్ టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 190 కోట్లు చెల్లించింది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరించినప్పటికీ తాము నడపలేమని భాగస్వామ్య సంస్థ అయిన డెల్టా పేపర్స్ లిమిటెడ్ గతంలోనే ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

సంస్థలో 51 శాతం వాటాను కలిగియున్న డెల్టాకు స్వస్తి పలకాలంటే ఆస్తుల విలువ, సాంకేతిక స్థితిగతులు, న్యాయపరమైన చిక్కులు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. 2025 డిసెంబరు నాటికి ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించినప్పటికీ.. అది మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ యేడాది క్రషింగ్ సీజన్ (అక్టోబరు నుంచి డిసెంబరు) నాటికి కర్మాగారం పరిధిలో రైతులు గణనీయమైన విస్తీర్ణంలో చెరుకు పంట పండించేందుకు ముందుకు రావాల్సి ఉంది. ఇప్పటి నుంచి వానాకాలం వరకు చెరుకు నాటేందుకు అనువైన సమయం ఉంటుందని రైతులు అంటున్నారు.

తొమ్మిదన్నరేళ్లుగా లే ఆఫ్‌లో..

నిజామాబాద్ జిల్లా బోధన్ కేంద్రంగా 1938 సంవత్సరంలో నిజాం సర్కారు నిజాం చక్కర కర్మాగారం ప్రారంభించింది. దీనికి అనుబంధంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో పరిశ్రమలను స్థాపించింది. గత పాలకుల విధానాలు, పరిశ్రమ నష్టాల బాట పట్టిందన్న కారణంతో 2002 సంవత్సరం ప్రైవేటీకరణ చేశారు. ఈ మూడు యూనిట్లు 51శాతం డెల్టా కంపెనీ, 49 శాతం ప్రభుత్వ వాటాలను కలిగి ఉన్నాయి. అయినా నష్టాల నుంచి బయట పడకపోవడంతో 2015 డిసెంబరు 23వ తేదీన లేఆఫ్‌గా ప్రకటించి బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి కర్మాగారాలను యాజమాన్యం మూసివేసింది.

అనంతరం బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో కర్మాగారాలను తెరిపిస్తామని హామీనిచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణపై కసరత్తులు చేస్తోంది. రాష్ట్ర మంత్రి శ్రీదర్‌బాబు ఛైర్మన్‌గా ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైస్ ఛైర్మన్‌గా సభ్యులుగా జగిత్యాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, పలు విభాగాలకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులను నియమించింది. కమిటీ ఇప్పటికే కర్మాగారాలను సందర్శించి ప్రభుత్వానికి సమాచారం అందించింది.

తేలని డెల్టా వాటా వ్యవహారం..

నిజాం షుగర్స్‌పై అధ్యయనం చేసి ఆస్తుల విలువను లెక్కించి అవసరమైన సలహాలు, సూచనలతో నివేదికను సమర్పించడానికి క్యాపిటల్ ఫార్చ్యూన్స్ అనే సంస్థను కన్సల్‌టెంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. సాధ్యమైనంత తొందరలో కన్సల్‌టెంట్ కంపెనీ అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించింది. ప్రస్తుతం కర్మాగారాల్లోని యంత్రాలు వినియోగించే స్థితిలో ఉన్నాయా...మరమ్మతులతో నడిపించుకునే వీలు ఉంటుందా..లేదంటే కొత్తవి కొనుగోలు చేయాలా అన్న వివరాలు సేకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్‌డీఎస్‌ఎల్ తరఫున సమాచారం ఇచ్చేందుకు సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ డిప్యూటీ డైరెక్టర్‌ను సమన్వయ అధికారిగా ప్రభుత్వం నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. కన్సల్‌టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడానికి యోచిస్తున్నారు. డెల్టా వాటాను తిరిగి అప్పగించి స్వస్తి పలకాలంటే ఏమి చేయాలన్న అంశం తేలడం లేదు.

నిర్వహణపై రాని స్పష్టత...

ఎన్‌డీఎస్‌ఎల్‌లో భాగస్వామిగా ఉన్న డెల్టా కంపెనీకి స్వస్తి పలికి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్మాగారాలను ఎలా నిర్వహించాలన్న అంశంపై కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ పెద్దలు పలు విధాలుగా సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ ఉండాలా.. ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించాలా.. సహకార పద్ధతిలో నిర్వహించాలా అన్న అంశంపై ఇంకా స్పష్టత రావడం లేదు. సహకార పద్ధతిలో నడిచే షుగర్ ఫ్యాక్టరీల ప్రోత్సాహకానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంతో నిధులు రావాలంటే సహకార విధానం అనుసరించాలా అన్న చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

ప్రస్తుత యేడాది డిసెంబరు నాటికి కర్మాగారాలను పునరుద్ధరణ జరుగుతుందని కమిటీ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అంశాలపై స్పష్టత రావడం లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయాలు జరిగితేగాని పునరుద్ధరణ ముందుకు పడే అవకాశాలు లేవన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కర్మాగార పునరుద్ధరణపై అన్నదాతలు ఆశతో ఎదురు చూస్తున్నారు.


జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కర కర్మాగారం

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం తెల్లవారు జామును నుంచి రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవోలు శ్రావన్ కుమార్, అశోక్‌కుమార్‌లు సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ రాజేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తులు

ఘనంగా ఆరుద్ర నక్షత్రోత్సవము..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతార్చనలు సదస్యం గావించారు. కాగా రాజన్న ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జగద్గురు శంకరాచార్యుల జయంతి శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం సదస్యము వసంతమాధవ పూజ కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

రాజన్నసేవలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌లు..

రాజరాజేశ్వర స్వామివారిని డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణ ప్రసాద్, టంకశాల వెంకటేష్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌లు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వీచ్చేసిన వారికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఏఈవో శ్రావణ్ కుమార్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట నును గొండ రాజేందర్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీమోహన్, గొట్టం గిరిబాబు తదితరులు ఉన్నారు. కాగా, వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన కూరగాయల శంకర్ పదవీ విరమణ చేశారు. ఆలయ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

ప్రారంభమైన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

- కరీంనగర్ జోన్ పరిధిలో 12కేంద్రాలు
- 5,628మంది అభ్యర్థులకు 5,356మంది హాజరు

తిమ్మాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు ఏప్రిల్ 29, 30తేదీల్లో జరగగా, మే 2నుంచి 4వరకు ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఎప్‌సెట్ పరీక్షలకు కరీంనగర్‌జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, సిద్దిపేటలో మొత్తం కలిపి 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.


పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

5,628మంది అభ్యర్థులకు 5,356మంది హాజరు..

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6 గం టల వరకు రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. ఉదయం 7.30నుంచి, మధ్యాహ్నం 1.30 నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అంటే పరీక్ష సమయానికి 90 నిమిషాల ముందునుంచే అభ్యర్థులను పరీ క్షకేంద్రాల్లోకి అనుమతించారు. కరీంనగర్ జోన్ పరిధిలోని 12కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 2,813మంది విద్యార్థులకుగాను 2,672మంది(95%) అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 141 మంది హాజరు కాలేదు. రెండో సెషన్‌లో 2,815మంది విద్యార్థులకుగాను 2,684మంది (95.3%)హాజరు కాగా 131మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం

- పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించిన విప్ అడ్లూరి
- ఆది దంపతుల కల్యాణం తిలకించి తరించిన భక్తులు


కోటిలింగాలలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలో పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయమంలో శంకర జయంతి సందర్భంగా పార్వతీ కోటేశ్వరస్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన అభిషేకాదుల వంటి పూజలు నిర్వహించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారలకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ మద్దుల గోపాల్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం కరీంనగర్‌కు చెందిన అంబటి అనూష- రవీందర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్‌శర్మ, అన్వేష్ శర్మ, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ ఛైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు నక్క రవితేజ, గోల్ల తిరుపతి, మెరుగు మురళి గౌడ్, పూదరి రమేష్, బందెల ఉదయ్‌గౌడ్, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు

కోటిలింగాల కోటేశ్వరస్వామిని శుక్రవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

గంజాయి ముఠా అరెస్ట్

9 కిలోల గంజాయి స్వాధీనం

ఓదెల, మే 2((ఆంధ్రజ్యోతి): మత్తుకు యువకులు, విద్యార్థులు దూరంగా ఉండాలని, గంజాయిని పూర్తిగా తుదముట్టించే వరకు కఠిన చర్యలు కొనసాగుతాయని డీసీపీ పుల్లా కరుణాకర్ అన్నారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి గంజాయి నిందితుల వివరాలను వెల్లడించారు. డీసీపీ కరుణాకర్ మాట్లాడుతూ పొత్కపల్లి రైల్వే స్టేషన్ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ బృందం వెళ్లి పరిశీలించారని, అక్కడ అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని పట్టుకుని విచారించగా వారి వద్ద రూ.4.8లక్షల విలువ చేసే 9కిలోల 64గ్రాముల ఎండు గంజాయి లభించిందని చెప్పారు. గంజాయితో పాటు నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తెలిపారు.

గంజాయి ముఠాకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు డీసీపీ తెలిపారు. ఇందులో ప్రధాన నిందితుడు అంతర్గాం మండలం ముర్మూర్‌కు చెందిన జాడి కిరణ్ కాగా, ఇదే గ్రామానికి చెందిన జాడి ప్రకాష్, గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన గుజ్జుల సాయి, రామగుండం చెందిన కొమురవెళ్లి పవన్, అంతర్గాంకు చెందిన ఇండిబిల్లి సందీప్‌కుమార్, ముర్మూర్‌కు చెందిన లింగన్నపేట విష్ణువర్ధన్, అలాగే ఒడిస్సా రాష్ట్రంలోని ఉరుమనూర్ మండలం కలిమేలకు చెందిన కేల కుమార్‌పై కేసు నమోదు చేశామని, ఇందులో కేల కుమార్ పరారీలో ఉన్నట్టు డీసీపీ తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది కిషన్, రాజేందర్, సతీష్‌లను అభినందించి నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.


పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- ట్రాక్టర్, కారు ఉంటే అనర్హత
- నిబంధనలు కఠినతరం

చొప్పదండి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. పక్కాగా పేదలకు ఇళ్లు దక్కేలా పకడ్బందీగా సర్వే చేస్తుండగా, నిబంధనలు కఠినతరంగా ఉండడంతో అనేక మందికి ఇళ్లు దక్కే అవకాశం లేదు. కారు, ఏసీ, ట్రాక్టర్‌తో పాటు చాలా నిబంధనలు రూపొందించగా, వడపోతలో లబ్ధిదారులు ఇళ్లకు అర్హత కోల్పోతున్నారు. ప్రస్తుతం చొప్పదండి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల సర్వేకు ప్రత్యేక అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను అందించింది.



నిబంధనలు ఇవే...

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబానికి చెందిన వారై ఉండాలి. గ్రామాల్లో నివసించే లబ్ధిదారుడి ఆదాయం నెలకు 10 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలకు 15 వేలలోపు ఉండాలి.
- రెండున్నర ఎకరాలకు ఎక్కువ భూమి ఉన్న రైతులు అనర్హులు.
- నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో కేసీసీ (క్రాప్ లోన్) 50 వేల రూపాయలకు మించి ఉండరాదు.
- వ్యాపారం, అదనపు ఆదాయ పన్ను, ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించే లబ్ధిదారులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అర్హులు కారు.
- దరఖాస్తు చేసుకున్న ప్రాంత నివాసి అయి ఉండాలి.
- సంచార కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయరాదు.
- ప్రస్తుతం రేకుల షెడ్డు, గుడిసె, గునెపెంకుల ఇంటిలో నివాసం ఉన్న లబిదారుడు అర్హుడు.
- తండ్రి, ఇద్దరు కుమారులతో నివాసం ఉన్నట్లయితే ఒక్కరికే ఇందిరమ్మ ఇళ్లమంజూరు చేస్తారు.
- మున్సిపల్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉండే లబ్ధిదారులు అర్హులే.
- పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్ ఉండాలి.
- లబ్ధిదారుడికి 60 గజాల ఇంటి స్థలం ఉండాలి.
- ఇంటి స్థలానికి సంబంధించి పట్టా, ఓనర్‌షిప్ సర్టిఫికెట్ లేకుంటే ఇల్లు మంజూరు చేయరాదు.
- కొత్త ఇంటి నిర్మాణం 400 నుంచి 600 అడుగులలోపు ఉండాలి. అధికంగా ఉంటే అనుమతి ఇవ్వరాదు.
- ఇండ్ల నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డితో నిర్మించాలి.
- ఇంటి నిర్మాణం ఇంతకు ముందే ప్రారంభించిన, పాత ఇంటిని కలుపుకొని నిర్మించిన కొత్త ఇందిరమ్మ ఇంటికి అనర్హులే.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి
ఐవీవై సిద్ధార్థలో వేసవి శిబిరం ప్రారంభం


శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సీతారాంపూర్‌లోని ఐవీవై సిద్ధార్థ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ఛైర్మన్ పసుల మహేష్ మాట్లాడుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో డిప్లొమా కంప్యూటర్ అప్లికేషన్ శిక్షణను 30 రోజులు ఉచితంగా బోధిస్తున్నట్లు చెప్పారు. బోధనతోపాటు, ప్రతీ రోజు విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 80 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, సోమవారం వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ఐవీవై కో-ఛైర్మన్ శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిషేధాజ్ఞలు కొనసాగింపు

● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, డీజే సౌండ్‌లు, డ్రోన్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధాజ్ఞలు ఈ నెల 31 వరకు కొనసాగుతాయని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా కాల పరిమితి పొడిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని, ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించరాదని తెలిపారు. జనాలను సమీకరించకూడదని, మ్యూజిక్, పాటలు, ప్రసంగాలు చేయకూడదని పేర్కొన్నారు.

పురుమల్ల శ్రీనివాస్‌పై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు


మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ముఖ్యనాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పురుమల్ల శ్రీనివాస్ పరోక్షంగా దూషణలకు దిగారని వివరించారు. తక్షణమే వేటువేయాలని కోరారు. పురుమల్ల వ్యవహారంపై ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, పార్టీ పరిశీలకులు, ముఖ్యనేతల నుంచి నివేదిక తెప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని మహేశ్ కుమార్‌గౌడ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జనద్ రహమాత్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మడుపు మోహన్, తుమ్మనపల్లి శ్రీనివాస రావు, కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ పురం రాజేశం, జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

● పురుమల్ల శ్రీనివాస్‌ను అసెంబ్లీ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించాలని కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు భగత్‌నగర్ బృందావన్ గార్డెన్‌లో 'పహల్గాం ఘటన అనంతరం భారత్ వ్యూహాత్మక అడుగులు-పరిణామాలు' అనే అంశంపై సమావేశం ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల నాగేశ్వర రావు, మందల నగేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సంస్థ రాష్ట్ర గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎల్.రాజభాస్కరరెడ్డి, డి.నిరంజనాచారి హాజరవుతారని పేర్కొన్నారు.

● కరీంనగర్ చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఉదయం 8-30 గంటల నుంచి 12-30 వరకు ముఖరంపుర లోని వాణీనికేతన్ పాఠశాలలో చిన్మయ బాలల వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో మోరల్ స్టోరీస్, భజనలు, యోగా, గేమ్స్, క్విజ్, గీత చాటింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వంటివి నేర్పించనున్నట్లు పేర్కొన్నారు.

గణేష్‌నగర్: విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో పర్యవేక్షక ఇంజనీరు రమేష్‌బాబు ఆవిష్కరించారు.

భగత్‌నగర్: ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్‌ను జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో రాష్ట్ర సహాయకార్యదర్శి బామండ్లపల్లి యుగేందర్, రాష్ట్ర సమితి సభ్యుడు బోనగిరి మహేందర్ ఆవిష్కరించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలంలోని ఎలబోతారంలో శుక్రవారం రాధాకృష్ణస్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ కరివేద వేణుమాదవ్‌రెడ్డి, ఆర్కిడ్ ఆస్పత్రి నిర్వాహకుడు వికాస్ పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: కేంద్ర ప్రభుత్వం కులగణనపై నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం


ప్రారంభిస్తున్న మాజీ మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెవెన్యూగార్డెన్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన, అమ్మకాలను మాజీ మేయర్ సునీల్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 వరకు చేనేత హస్తకళా ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పవన్ కుమార్ మోడీ, రాణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అలరించిన 'అడియాస్'


ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం అడియాస్ పేరుతో నిర్వహించిన వీడ్కోలు సమావేశం అలరించింది. శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చడానికి ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అన్నారు. కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు మాట్లాడుతూ ప్రపంచం నలుమూలలా హోటల్ రంగం అభివృద్ధి చెందిందని, టూరిజం విస్తరించిందని అన్నారు. కిమ్స్ విద్యార్థులు విదేశాల్లోనూ ఉద్యోగాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ గౌతమ్, సిబ్బంది అజయ్, సతీష్, సాయిబాబు, చంద్రకళ, శిరీష పాల్గొన్నారు.

నగరానికి చేరుకున్న ఆటో రథయాత్ర

సుభాష్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ చైర్మన్ మంద రవికుమార్ ఏప్రిల్ 25న మెదక్‌లో ప్రారంభించిన రథయాత్ర శక్రవారం నగరానికి చేరుకుంది. చైర్మన్‌కు కరీంనగర్ ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలామాల వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి బండారి సంపత్, ఉపాధ్యక్షులు మద్దుల రామ్‌కోపాల్‌రెడ్డి, మఠం సాగర్‌లూనార్, నరసింహ నాయక్, అంతగిరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

కరీంనగర్ క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ వసూల్ దందా చేశారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల కృపాసాగర్ అన్నారు. శుక్రవారం నాయకులతో కలిసి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసత్య ప్రచారం చేస్తున్న యువజన కాంగ్రెస్ కరీంనగర్ రూరల్ ప్రెసిడెంట్ గట్టు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్, ఇతర యువజన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్

భగత్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేవైఎం జిల్లా ప్రభారి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్ ఆధ్వర్యంలో యువమోర్చా ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక ప్రజలకు చేసిందేమీలేదన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు శశిధర్‌రెడ్డి, శ్రీరాముల శ్రీకాంత్ పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణం

కరీంనగర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగునూరులోని దుర్గాభవానీ ఆలయ అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాభవానీ సుందరేశుల కల్యాణాన్ని ఆలయ ధర్మాధికారి, వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా ఫలపంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వేములవాడ ద్రోణాచారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే2 (ఆంధ్రజ్యోతి): నగరంలో మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8:30 నుంచి 10:30 వరకు అంబేద్కర్ నగర్,శివాజీ నగర్, కిసాన్‌నగర్, ఎస్టీ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 10 వరకు రెడ్డి ఫంక్షనల్ ఏరియా, ఎస్ ఆర్ కళాశాల, బూత్ బంగ్లో, విద్యాధారి పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 వరకు కరీంనగర్ రూరల్ మండలంలోని గుంటూర్‌పల్లి, దుర్శేడ్, గోపాల్‌పూర్, విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏడీఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం

ఆలయాల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 2: స్థానిక భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంతోపాటు సముదాయ ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ధర్మ కర్తలు సత్యనారాయణ, శ్రీనివాస్, కవిత, ఆనంద్ రెడ్డి, కృష్ణ, ఈవో కొన్న కాంతారెడ్డి పాల్గొన్నారు.

శంకరాచార్య, రామానుజాచార్య జయంతి

కరీంనగర్ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాతబజార్ గౌరీ శంకరాలయంలో పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో శంకరాచార్యుల జయంతి నిర్వహించారు. గణేశ శారదా శంకరాలయంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. వైష్ణవాలయాలతోపాటు ఆండాళ్ భవనంలో రామానుజ జయంతి నిర్వహించారు. వేద భవనంలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాదాచార్యులు, జిల్లా అధ్యక్షుడు గౌతమరావు, ఎస్‌వీఎస్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకం

భగత్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్రకీలకమని తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం వాగేశ్వరి కళాశాలలో కరీంనగర్ శాఖ ఆధ్వ్యంలో నారద జయంతి జర్నలిస్ట్ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారద మహర్షి జయంతిని పాత్రికేయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎస్ఎస్ బాధ్యులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడిశెట్టి పురస్కారాల ప్రదాన సభ

కరీంనగర్ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రచయితల వేదిక, ఉమ్మడిశెట్టి లిటరసీ ట్రస్టు సంయుక్త నిర్వహణలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింభవన్‌లో ఉమ్మడిశెట్టి సాహిత్య పురస్కారాల సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే సభలో కరీంనగర్‌కు చెందిన కవి జనగాని యుగంధర్ కవితా సంపుటి 'ఇదేమి యుద్ధం' పుస్తకాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

పహల్గాంలో ఉగ్రదాడిపై బీజేపీ నిరసన

కరీంనగర్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసిన ఘటనకు బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ ఆధ్వర్యంలో శుక్రవారం నగునూర్ ప్రధాన రహదారిపై పాకిస్థాన్ చిత్రపటాలను అంటించి తొక్కుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఘటనను హిందు సమాజంపై దాడిగానే ప్రపంచ దేశాలు భావిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నాయకులు దాసరి రమణారెడ్డి, గాండ్ల గోపాల్, గుర్రం కమలాకర్, మల్లెత్తుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ బహదూర్ ఆశయాలు కొనసాగించాలి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్/ భగత్‌నగర్, మే2 : (ఆంధ్రజ్యోతి): రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగించాలని మాజీ శాసన సభ్యుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజబహదూర్ వెంకటరామిరెడ్డి 73వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద విగ్రహానికి పూల మాల వేసి నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజబహదూర్ ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పి ఎంతోమందికి విద్య నందించారన్నారు. అనంతరం సీతారాంపూర్‌లోని రాజబహదూర్ వెంకటరామిరెడ్డి బీఈడీ కళాశాలలో విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కరీంనగర్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కేశవరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రాఘవరెడ్డి, రాధా కృష్ణరెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా రెడ్డి సం క్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్సా రార్ కళాశాల వద్ద వెంకటరాంరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల బీఎడ్ కళాశాల కరస్పాండెంట్ బండ గోపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒలింపియాడ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రామడుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఒలింపియాడ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్‌హైస్కూల్‌లో జిల్లావిద్యాశాఖ, అల్ఫోర్స్‌విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహించిన రెండో దశ ఒలింపియాడ్ పరీక్షవిజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమికదశ నుంచే పోటీతత్వాన్ని పెంపొందించాలన్నారు. సౌకర్యాలు కల్పించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఒలింపియాడ్ సమన్వయకర్తలు అశోక్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, పలుమండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలంలో 48,506క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

మానకొండూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మానకొండూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో 20580, ఐకేపీ ఆధ్వర్యంలో 22,226, హాకా ఆధ్వర్యంలో జగ్గయ్యపల్లిలో 5700క్వింటాళ్ల కొనుగోలు చేశారు. మండలవ్యాప్తంగా మొత్తం 48506క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలో గల మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమసంవత్సరంలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశామని ప్రిన్సిపాల్ ఎం వనజ ఒకప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మోడల్ కళాశాలలో ఎంపీసీ,బైపీసీ,సీఈసీ,ఎంఈసీగ్రూప్‌లలో పదవతరగతి పాసైన విద్యార్థులు http//183.82.87.97./mstg వెబ్‌సైట్‌లో ఈ నెల5 నుంచి 20తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22న దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రకటిస్తామన్నారు. 26న మెరిట్, రిజర్వేషన్‌ల వారీగా విద్యార్థులు ఏ గ్రూప్‌లో ఎంపికయ్యారో తెలియజేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 27నుంచి 31వ తేదీల్లో తమ ఒరిజినల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జూన్‌నుంచి సీటుపొందిన విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రూ.7550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7550పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 91క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7550, కనిష్ఠ ధర రూ.7100 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

5నుంచి రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు

హుజూరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలతో నేరుగా రైతుల ముఖాముఖి కోసం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీఏ సునీత శుక్రవారం తెలిపారు. జమ్మికుంట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, వ్యవసాయ శాఖ సమన్వయంతో హుజూరాబాద్ డివిజన్‌లో ఈనెల 5నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 5న మడిపల్లి, జమ్మికుంట, 14న అంకుషాపూర్, జమ్మికుంట, 23న బోగంపాడు, ఇల్లందకుంట, 30న పాతర్లపల్లి, ఇల్లందకుంట, జూన్ 6న నర్సింగాపూర్, వీణ వంక, జూన్ 10న కాట్రపల్లి, హుజూరాబాద్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


జమ్మికుంటలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


ఇల్లందకుంటలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ రూరల్/ఇల్లందకుంట/మానకొండూర్/శంకరపట్నం/జమ్మికుంట/వీణవంక, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాల్లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి శుక్రవారం బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. భారతదేశ వ్యాప్తంగా కులగణనకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇల్లందకుంట, శంకరపట్నంలలో బీజేపీ మండలాధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, ఏనుగుల అనిల్, మానకొండూర్‌లో జిల్లాకార్యవర్గ సభ్యుడు రావుల శంకరాచారి, మాచర్ల కోటేశ్వర్, నందగిరి బలరాం, జమ్మికుంటలో బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కులగణన పేరుతో కాంగ్రెస్ చేస్తున్న రాజకీయానికి ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయం చెంపపెట్టు వంటిదని కరీంనగర్‌రూరల్ బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ అన్నారు.

కమిషనర్‌కు రూ.3కోట్ల ప్రొసీడింగ్ అందజేత

జమ్మికుంట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపాల్టీ ఎర్లీబర్డ్ స్కీంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం హైదరాబాద్‌లో మున్సిపల్ సెక్రెటరీ శ్రీదేవి(ఐఏఎస్) చేతుల మీదుగా పట్టణ అభివృద్ధికోసం రూ.3కోట్ల ప్రొసీడింగ్‌ను కమిషనర్ మహమ్మద్ ఆయాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, ఆర్‌వో వాణి, మహేష్, మొగిలయ్య, ఎండి పాషా, ముషం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో శనివారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విద్యానగర్ ఫీడర్ ట్రీ కటింగ్, కరెంట్ లైన్‌వర్క్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 7నుంచి 9గంటలవరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని వరంగల్‌రోడ్, విద్యానగర్, గాంధీనగర్, కాకతీయ కాలనీ, ఓల్డ్‌ఎక్సేంజ్, పాతసూపర్‌బజార్ ఏరియాలప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్‌హెచ్‌వోగా స్వాతి

గంగాధర, మే 2 (ఆంధ్రజ్యోతి): గంగాధర ఎస్‌హెచ్‌వోగా స్వాతి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న ఆమె నెల రోజులపాటు ఎస్‌హెచ్‌వోగా పనిచేయాల్సి ఉండగా గంగాధర మండలానికి కేటాయించారు. ఇందులో భాగంగా నెలరోజులపాటు ఎస్‌హెచ్‌వోగా గంగాధరలో పని చేయనున్నారు.

మావోయిస్టుల ఎన్‌కౌంటర్ రాజ్యాంగ విరుద్ధం

హుజూరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర సరిహద్దుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతోమందిని ఎన్‌కౌంటర్ చేస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అడవి ఆస్తి దోచిపెట్టాలనే ప్రధానలక్ష్యంతో ప్రధానిమోదీ, అమిత్‌షా ఆడుతున్న నాటకంలో మావోయిస్టులు బలైపోతున్నారన్నారు. మోదీ, అమిత్‌షా రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటే మావోయిస్టులతో చర్చలు జరపాలని, కాల్పుల విరమణ చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడీ రవితేజ, యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చల్లూరి రాహుల్, యూత్ కాంగ్రెస్ నాయకులు అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

హుజూరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని హుజూరాబాద్ కోర్టు న్యాయాధికారి పీబీకిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హైస్కూల్‌మైదానంలో స్వచ్ఛ హుజూరాబాద్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంఈవో శ్రీనివాస్, తోట రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై ధర్నా

వీణవంక, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలపై కొర్కల్ గ్రామస్థులు రోడ్డుపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు ఇవ్వకుండా ఉన్నవారికే కేటాయించారని మండిపడ్డారు. కొంతమంది అధికారులు డబ్బులు ఇస్తేనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని బహిరంగగానే అంటున్నారని కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. కార్యక్రమంలో మ్యాక్రికుమార్, పూదరి అనిల్, మర్రి స్వామి, కృష్ణ,రాకేష్, అనిల్, రాజు, తిరుపతి,మల్లయ్య తదితరులున్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన

తిమ్మాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ప్రమాదాల నివారణకు సిబ్బంది, వినియోగదారులతోపాటు ప్రతి ఒక్కరూ భద్రతసూచనలుపాటించాలని కరీంనగర్ రూరల్ డీఈ(ఆపరేషన్స్) ఎం తిరుపతి అన్నారు. శుక్రవారం అలుగునూర్‌లో గల ఏడీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేయడంతోపాటు ప్రమాదాలు జరుగకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ(టెక్నికల్) ఉపేందర్, ఏడీఈటీ శ్రీనివాస్, ఏడీఈశ్రీనివాస్, ఏఈలు వీరాచారి, లక్ష్మణమూర్తి, విద్యుత్ శాఖఇంజనీర్లు,లైన్మెన్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి సీపీఐ మండల కార్యదర్శిగా నాగెల్లి లక్ష్మారెడ్డి

చిగురుమామిడి,మే 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా మూడోసారి మండలంలోని లంబాడిపల్లికి చెందిన నాగెల్లి లక్ష్మారెడ్డిని ఎంపికచేసినట్లు జిల్లాకార్యదర్శి మర్రి వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. మండలంలో అన్నిగ్రామాల్లో పార్టీని అభివృద్ధి చేస్తూ, ప్రజా పోరాటాలు చేసిన లక్ష్మారెడ్డిని మండలసభలో గుర్తించి ఎంపిక చేశామన్నారు. మండలసహాయ కార్యదర్శులుగా చాడ శ్రీధర్‌రెడ్డి, బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేశ్‌ను ఎంపిక చేశారు.

అవీ.. ఇవీ..

హుజూరాబాద్: పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ స్కూల్‌లో గ్లోబల్‌షో టోకాన్ కరాటేడో ఇండియా జిల్లాఅసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

సైదాపూర్: విద్యార్థులకు విద్యతోపాటు విలువలు నేర్పాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో స్వశక్తి సంఘాలు, జేఏసీల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నిర్వహించారు.

రామడుగు: పదవతరగతి పరీక్షా ఫలితాల్లో రామడుగు జడ్పీఉన్నత పాఠశాలకుచెందిన 12మంది విద్యార్థులకు 12 మంది ఉత్తీర్ణత సాధించగా, నునుగొండ రీతి567మార్కులు సాధించింది. విద్యార్థులను అమ్మఆదర్శపాఠశాల కమిటీచైర్మన్ లక్ష్మి, పాఠశాలప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులుఅభినందించారు.

-మండలంలోని షానగర్ లక్ష్మీఫంక్షన్ హాల్‌లో మండల మున్నూరుకాపు సంఘ సమావేశం నిర్వహించారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిచెందాలని నాయకులు సూచించారు.

-మండలంలోని గోపాల్‌రావుపేటలో ఫిజియోథెరపి, రిహాబిలిటేషన్ క్లినిక్‌ను శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు.

గంగాధర: మండలంలోని వివిధ గ్రామాలకుచెందిన 72మంది లబ్ధిదారులకు మంజూరైన 21.16లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మార్కెట్‌కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శుక్రవారం పంపిణీ చేశారు.

-మండలకేంద్రంలో శుక్రవారం ఎంఈవో ప్రభాకర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

గన్నేరువరం: గన్నేరువరం తహసీల్దారుగా జె నరేందర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడవిధులను నిర్వహించిన తహసీల్దారు ఇప్పనరేందర్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లిలో ధాన్యం కొనుగోలుకేంద్రానికి స్థలం ఇప్పించాలని గ్రామహమాలి సంఘం నాయకులు శుక్రవారం కరీంగర్ ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు.